నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 కరీంనగర్, బుధవారం 20 డిసెంబర్ 2023
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## శ్రీలంకలో వాసవి భజన బృందం ఆధ్వర్యంలో చండీయాగం


చండీయాగం చేస్తున్న బాచంపల్లి సంతోష్‌కుమార్

బెల్లంపల్లి, డిసెంబర్ 19 : బెల్లంపల్లి వాసవి భజన బృందం సహాయక సంఘం ఆధ్వర్యంలో శ్రీలంకలోని శాంకరీమాత శక్తి పీఠం వద్ద చండీయాగం వైభవంగా నిర్వహించారు. మంగళవారం మన వేదపండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్, పులి సీతారం శర్మ యాగం చేశారు. దాదాపు నాలుగు గంటలు నిర్విరామంగా జరిగిన ఈ కార్యక్రమానికి 200 మందికిపైగా భక్తులు హాజరయ్యారు. సోమవారం రాత్రి వంద మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. 24 గంటల భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ కృష్ణారావు

కౌటాల, డిసెంబర్ 19 : వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిష్, ఉపసర్పంచ్ తిరుపతి, పీఏసీఎస్ సీఈవో రాజేశ్, తాజీం హుస్సేన్, ఏఈవో ఘన్‌శ్యాం, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు, నాయకులున్నారు.

# మణిప్రసాద్ ప్రతిభ భేష్


- జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు అందుకోవడం అభినందనీయం
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్


విద్యార్థి మణిప్రసాద్‌ను అభినందిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, డిసెంబర్ 19 : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో మణిప్రసాద్ చూపిన ప్రతిభ భేష్ అని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కోటపల్లి మండలం అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జుమిడి మణిప్రసాద్‌ను, గైడ్ ఉపాధ్యాయుడు సురేందర్‌ను జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 9 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో మణిప్రసాద్ తయారు చేసిన గ్రైన్ పొటెక్టర్ ఫ్రమ్ రెయిన్ అండ్ యానిమల్స్ అంశం జాతీయ అత్యుత్తమ ఇన్‌స్పైర్ అవార్డు అందుకోవడం గొప్ప విషయమన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్ చేతుల మీదుగా మణిప్రసాద్ అవార్డు అందుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దాదాపు వెయ్యి మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అత్యుత్తమంగా నిలిచిన 60 మందిలో మణిప్రసాద్ ఉండడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముమ్ముందు మరిన్ని ఆవిష్కరణలు చేసి.. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, గైడ్ టీచర్ సురేందర్ పాల్గొన్నారు.

# వంటింట్లో ధరల మంట

- రెట్టింపైన కూరగాయల ధరలు
- అకాల వర్షాలకు దెబ్బ తిన్న పంటలు
- కార్తీకం, షష్ఠి, దీక్షలు కూడా కారణమే..




మంచిర్యాల, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో భగభగ మండుతున్నాయి. ఇప్పటికే బియ్యం ధరలు ఆకాశాన్నంటుతుండగా.. అదే దారిలో వెజిటేబుల్స్ రేట్స్ కూడా రెట్టింపు(డబుల్) అయ్యాయి. రెండు నెలల క్రితం రూ.200 నుంచి రూ.300లు మార్కెట్‌కు తీసుకెళ్తే వారానికి సరిపడా కూరగాయలు వస్తే.. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800 పెట్టినా రావడం లేదు. ధర తక్కువగా ఉన్న టమాట, ఆలు, పప్పులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదని జనం పేర్కొంటున్నారు. అల్లం, ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ ధరలు కూడా గతంలో పోలిస్తే రెట్టింపు అయ్యాయని, ఏం కొనాలన్న కిలోకు రూ.100 ఉంటోందని వాపోతున్నారు.

### ఎందుకు పెరిగాయి..

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేలరాలింది. దీనికి తోడు వాతావరణంలో మార్పులు రావడంతో చీడపీడలు పడుతూ.. పూత, కాత రాకుండా పోయింది. సమయానికి వర్షాలు కురియకపోవడం, చలి తీవ్రత అధికంగా ఉండడం వంటి కారణాలతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. ఇదే సమయంలో అవసరాలకు సరిపడా పంటలు సాగులోకి రాలేదని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. మన వద్ద పంటలు దెబ్బతినడంతో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి మిగిలిన జిల్లాల మార్కెట్‌లకు కూరగాయలు సరఫరా అవుతున్నాయి. దీంతో ట్రాన్స్‌పోర్ట్, హమాలీ చార్జీలు పెరగడంతో ధరలు కూడా అమాంతం పెరిగాయి. మొన్నటి వరకు కార్తీకమాసం కావడం, ఇప్పుడు షష్ఠి(మల్లన్న బోనాలు), అయ్యప్ప, సాయిదీక్ష తీసుకున్న భక్తులు అధికంగా ఉండడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది.

**కూరగాయలు (కిలో ధర-రూపాయలు)**

| కూరగాయలు | రెండు నెలల క్రితం | ప్రస్తుతం |
|---|---|---|
| మిర్చి | 30 | 60 |
| మునగ | 60 | 130 |
| బీర | 40 | 120 |
| చిక్కుడు | 70 | 130 |
| బెండ | 30 | 100 |
| ఆనప | 40 | 100 |
| వంకాయ | 30 | 100 |
| దొండ | 30 | 80 |
| కాకర | 40 | 80 |
| గోరు చిక్కుడు | 40 | 80 |
| బీన్స్ | 40 | 80 |
| అలసంద | 30 | 80 |
| బీట్‌రూట్ | 60 | 80 |
| కాలిఫ్లవర్ | 20 | 80 |
| క్యాబేజీ | 30 | 60 |
| టమాట | 20 | 40 |
| దోస | 40 | 60 |
| ఉల్లిగడ్డ | 50 | 100 |
| ఎల్లిగడ్డ | 150 | 300 |
| అల్లం | 150 | 140-200 |

### ఉత్పత్తి లేకపోవడమూ కారణమే..

*అవసరానికి సరిపడా కూరగాయల ఉత్పత్తి లేదు. పంట నష్టంతోపాటు అది కూడా ధరలు పెరిగేందుకు కారణం. మంచిర్యాల మార్కెట్‌కు అధికంగా బెల్లంపల్లి, మంచిర్యాల రూరల్ ఏరియాల నుంచే కూరగాయలు వస్తాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దిగుమతి పెరిగింది. చలి, చల్లటి గాలుల నుంచి పంటకు రక్షించుకోవాలంటే విత్తనాలు వేసేటప్పుడే కూరగాయల చుట్టూ మక్క లేదా బంతి వేసుకోవాలి. అప్పుడు గాలులతోపాటు చీడపీడల నుంచి రక్షణ ఉంటుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కాలీఫ్లవర్, క్యాబేజీ వేసుకుంటే మంచిది.*

**- ఉదయ్, హార్టికల్చర్ జిల్లా అధికారి, మంచిర్యాల**

### కూరగాయల ధరలు భగ్గు మంటున్నయ్..

*చెన్నూర్ రూరల్, డిసెంబర్ 19 : వామ్మో.. మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గు మంటున్నయ్. వంకాయ, చిక్కుడుకాయ, బీరకాయల రేట్లైతే చెప్పనవసరం లేదు. ఏం కొందామన్నా మార్కెట్ల కిలోకు రూ.80 నుంచి రూ.100 వరకు చెపుతన్నరు. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల పరిస్థితేంటి. ఒక్కప్పుడు రూ.300 పట్టుకపోతే వారానికి సరిపడా కూరగాయలచ్చేవి. ఇప్పుడు రెండుమూడ్రోజులకు సరిపడా కూడా రావడం లేదు. ఏదేమైనా కూరగాయల ధరలు తగ్గాలని ప్రతి ఒక్కరూ కోరుకుటున్నరు.*

**- మాదాసు శ్రుతి, గృహిణి**

## మందమర్రిలో దీపాలంకరణ పోటీలు


మందమర్రిలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

మందమర్రి, డిసెంబర్ 19 : సింగరేణి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం మహిళలకు దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. సింగరేణి సేవా సమితి మందమర్రి ఏరియా అధ్యక్షురాలు ఏ.సవిత-మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు ఉత్సాహంగా ముగ్గులు వేసి దీపాలను అలంకరించారు. ఈ నెల 23న నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఎండీ. ఆసీఫ్, మైత్రేయబంధు, సీనియర్ పీవో కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


జీపీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జన్నారం, డిసెంబర్19 : పల్లెల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. చింతగూడ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువల్లో పూడిక తీయాలని, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి డంప్ యార్డుకు తరలించాలని సూచించారు. గ్రీన్ ఫ్రైడేలో భాగంగా మొక్కలకు నీరందించాలన్నారు. జీపీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రమేశ్, జీపీ కార్యదర్శి శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

CHANGE OF NAME

★ I, GURUPADH BADRA, (Old Name) R/o. 8-114/1, Teegalpahad, Naspur 504302 have Changed ny name as GURUPADA BHADRA S/O. RAJ BIHARI BHADRA (New Name)
NTK-317311

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677


బెంగాళీ రైతులు సాగు చేసిన పర్వల్ పంట

# వినూత్నం.. బెంగాళీల సేద్యం

**నజ్రూల్‌నగర్ పరిసర గ్రామాలు కూరగాయల సాగుకు పెట్టింది పేరు**

- అన్ని రకాల పంటలతో ప్రత్యేకత చాటుకుంటున్న కాందీశీకులు
- తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాలకు ఎగుమతి
- ఏడాదంతా లాభాలతో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ పరిసరాల్లోని బెంగాళీ క్యాంపులో ఉండే 13 గ్రామాలు కూరగాయల సాగుకు పెట్టింది పేరు. సుమారు 40 ఏళ్ల క్రితం వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డ కాందీశీకులకు అప్పటి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 5 ఎకరాల చొప్పున ఉచితంగా భూమి ఇచ్చింది. బెంగాళీలు వినూత్న పంటలు సాగు చేయడంలో దిట్ట. 2,808 మంది రైతులు సుమారు 4,500 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 1400 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో బోర్లు వేసుకొని వినూత్న పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. రసాయన ఎరువులు అసలే వాడరు. సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఇక ఇక్కడి రైతులు పండించిన వరిని బయట అమ్ముకోరు. తమ అవసరాలకే వాడుకుంటారు. రకరకాలుగా పండించిన కూరగాయలను కాగజ్‌నగర్‌తో పాటు చుట్ట పక్క గ్రామాల్లో విక్రయిస్తారు. అలాగే హైదరాబాద్, మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నారు. ఇలా కూరగాయల సాగుతో ఏడాదంతా లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఇక్కడి రైతులు.


### పర్వల్ ప్రత్యేకం..

బెంగాళీలు పండించే కూరగాయల్లో పర్వల్ పంట ప్రత్యేకమైనది. నజ్రుల్‌నగర్ పరిసరాల్లోని గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంట సాగవుతుందంటే ఎంత డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని బెంగాళీ క్యాంపుల్లోని రైతులు మాత్రమే ఈ పర్వల్ పంట సాగు చేస్తుంటారు. ఒక్కసారి ఈ పంట వేస్తే మూడేళ్లదాకా దిగుబడి పొందవచ్చు. బెంగాళీ క్యాంపులోని ప్రతి రైతూ పర్వల్ పంట సాగుచేయడం విశేషం.

### ఆదాయం ఫుల్

మన ప్రాంతంలో అంతగా పరిచయం లేని పర్వల్ పంటను కాందీశీకులు అన్ని కాలాల్లో పండిస్తున్నారు. ఇక్కడ అరుదుగా లభించే దొండకాయను పోలిన ఈ పర్వల్ పంటను కాందీశీకులు ఇష్టంగా వండుకుని తింటారు. తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలు పొందుతున్నారు. ఆయా ప్రాంతాలను బట్టి కిలోకు సుమారు రూ. 50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తారు. ఒక్కో ఎకరానికి మొత్తంగా 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.


### రూ. 10 లక్షల పంట అమ్మిన



*నాకున్న ఎకరంలో మూడేళ్ల కింద పర్వల్ పంట వేసిన. దాదాపు రూ. 30 వేలు ఖర్చయ్యింది. ఇప్పటి దాకా రూ. 10 లక్షల పంట అమ్మిన. మొత్తం హైదరాబాద్‌కు ఎగుమతి చేసిన. గీ పంట నాకు మంచి లాభాల తెచ్చింది. ఇక పక్కనే మరో 20 గుంటలు కౌలుకు తీసుకొని పూల గోబీ, ఆకు గోబీ, చిక్కుడు, ఆకు కూరలు సాగు చేస్తున్న. ఎప్పటికప్పుడు తెంపి స్థానిక సంతల్లో అమ్ముకుంటున్న.*

**- సుధీర్, రైతు, బెంగాళీ క్యాంపు**

### కూరగాయల సాగుతో మంచి లాభాలు



*నాలుగెకరాలు కౌలుకు తీసుకొని కూరగాయలు సాగు చేస్తున్న. ఇందులో రెండెకరాల్లో పర్వల్ పంట వేసిన. మిగతా భూమిలో అనేక రకాల కూరగాయలు వేసిన. మేము వరి, పత్తి అసలే వేయం. ముఖ్యంగా పర్వల్‌కు హైదరాబాద్, మహారాష్ట్రలో మంచి డిమాండ్ ఉంది. పంట ఇప్పుడే చేతికొస్తుంది. మిగతా పంటలకంటే కూరగాయల సాగుతో మంచి లాభాలు పొందవచ్చు.*

**- నిత్యానంద్, రైతు, బెంగాళీ క్యాంపు**

# టార్గెట్ 100%

**మంచిర్యాల బల్దియాలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

- లక్ష్యం రూ. 17.74 కోట్లు.. సేకరించింది రూ.6.86 కోట్లు
- మూడు స్పెషల్ టీమ్‌ల ఏర్పాటు
- గడువులోగా పూర్తి చేసేందుకు కసరత్తు


మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 19 : మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 70 రోజులే మిగిలి ఉండడంతో 100 శాతం వసూళ్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఈ ఏడాది రూ. 17.74 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 6.86 కోట్లు (38.65 శాతం) మాత్రమే వసూలు చేశారు. మిగతా రూ. 10.88 కోట్లు వసూలు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ , రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తున్నారు. ప్రధానంగా మొండి బకాయిలు ఎక్కువగా ఉన్న స్లమ్ ఏరియాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ నెల 15న కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు మూడు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు ఉద్యోగులను నియమించారు. వీరంతా తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పర్యటించి ఆస్తిపన్ను వసూలు చేస్తారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు, తిరిగి మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు పన్నులు వసూలు చేస్తారు. ఒకటో నంబర్ టీం సభ్యులు రాజీవ్‌నగర్, దొరగారిపల్లి, తిలక్‌నగర్, సాయికుంట, మజీద్‌వాడ ప్రాంతాలు, రెండో నంబర్ టీం సభ్యులు ఎన్టీఆర్‌నగర్, పాతగర్మిళ్ల, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో, మూడో టీం సభ్యులు పాతమంచిర్యాల, రంగంపేట, రాళ్లపేట, అండాళమ్మకాలనీ, అంబేద్కర్‌నగర్ ఏరియాల్లో ఉదయం పూట వసూళ్లకు వెళ్లనున్నారు.

### మిగిలింది వంద రోజులే..

ఆస్తిపన్ను వసూళ్లకు ఇంకా వందరోజులే మిగిలి ఉంది. 2024 మార్చి 31 వరకు పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఫిబ్రవరి నుంచి పన్ను వసూళ్లకు ఉపక్రమించేవారు. కానీ ఈసారి వందరోజుల ముందునుంచే పన్ను వసూళ్లపై దృష్టి సారించారు. మంచిర్యాల పట్టణంలో మొత్తం 26,577 భవనాలు ఉండగా, అందులో 23,526 నివాస భవనాలు, 1389 కమర్షియల్, 1662 మిక్స్‌డ్ (నివాస, వాణిజ్య ఉపయోగంలో ఉన్నవి) భవనాలు ఉన్నాయి. మొత్తం 17. 74 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ. 6.86 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ. 10.88 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, గడువులోగా పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.


జిల్లా చెస్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో యాదయ్య

# చెస్‌తో మేధాశక్తి

- మంచిర్యాల డీఈవో యాదయ్య
- శ్రీరాంపూర్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని మంచిర్యాల డీఈవో యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఆర్కే-6 కాలనీలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెస్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఉమ్మడి 10 జిల్లాల నుంచి చెస్ క్రీడాకారులు హాజరయ్యారని చెప్పారు. తమిళనాడులో ఈ నెల 24 నుంచి జాతీయ స్థాయి చెస్ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ, ఆసిఫాబాద్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, చీఫ్ ఆర్బిటార్ రామయ్య, అబ్జర్వర్ కరుణాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ జార్జ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 19 : జిల్లా కేంద్రంలో 20 నుంచి 23వ తేదీ వరకు అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల మైదనాన్ని, క్రీడాకారుల వసతి సౌకర్యాలను అధికారులతో కలిసి పరిశీలించారు. పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, నరేందర్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు